
అంకితం: శ్రీమతి 'రాధకు'

# దౌర్జన్యం

చంద్రశ్రీ




అతని చూపుల్లో-ఎన్ని వినిర్మలమైన ప్రేమ కాంతులు తొణుకాడుతుంటాయో—నేనుకాక ఒరులెవ్వరూ గ్రహించలేరు... అతను గుమ్మంలో అడుగు పెట్టిన మరుక్షణంలోనే-అతనిచూపులు నా హృదయంలో గ్రుచ్చుకుపోయాయి. తదాదిగా—కన్ను మూసినా తెరచినా-అతని స్వరూపమే. బెంగాలీలాల్చీ; పింజపోసి బెంగాలీకట్టుకట్టిన—ఆ ఎర్రటి పేటంచు ధోవతి, ఆ బెంగాలీక్రాపు-ఆ స్పెటికల్స్—ప్రత్యక్షమౌతూవుండేది. అతను రైలుదిగి మాయింటికొచ్చి, 'ఫలానావారు' ఉన్నారా? అనేవరకూ-'ఫలానా' అని పోల్చుకోలేక పోయాను. ఎప్పుడో చిన్నతనంలో చూశా, అప్పటికింకా అతనికి మీసకట్టే రాలేదు. అది మొదలు కొన్నాళ్లవరకూ మాయింట్లోనే వుండిపోయాడు. ఒక్క నిమిషం బజారుకు పనివుండివెడితే-హృదయమంతా ఏదో కలతగానూ-ఇల్లు అంతా కళావిహీనంగానూ వుండేది. అతను బజారువెంట నడుస్తూంటే-ప్రతి ఆడదీ తలుపుచాటున నుంచునో-కిటికీ ప్రక్కన నుంచునో; అతని సౌందర్యాన్ని-అతని గాంభీర్యాన్ని-విస్తుపోయి చూస్తూ-అతని ప్రేమ సామ్రాజ్యైక పట్ట భద్రురాలైన భాగ్యవతి యెవరోకదా?... ఎంత అదృష్టవంతురాలోకదా-ఏమైనా నిర్భాగ్యురాండ్రనుగా సృజించాడు పాడు బ్రహ్మ మమ్మల్ని-అని నిరాశతో దృష్టులు మరల్చుకునేవారు. వారాన్నట్లుగా ఆ భాగ్యవతిని నేనే ఎలా అయినాను-అంటే నాకే ఆశ్చర్యంగా వుంటుంది. ఆ విషయం జ్ఞప్తికి తెచ్చుకుంటే ...అయితే నాసౌందర్యంవల్లా- నాలోవున్న శక్తివల్లా-అయినానంటే వొప్పుకోను నా పూర్వజన్మ సుకృతంవల్ల-అయానంత భాగ్యవతిని...

* * *

ఒకనాడు:—

ఈజీచైరులో కూర్చుని-సిగరెట్—ఆరగా సిగరెట్ ముట్టిస్తూ-ఏదో 'నావెల్' చదువుకుంటున్నాడు. ఆయనగారు ఆఫీసు కెళ్లారు. ఏడుగంట లయితేనేకాని షైర్ వగైరా పూర్తి చేసుకుని ఇంటికి రారు. మధ్యాహ్నం షుమారు నాలుగుగంటలవుతుంది అప్పుడు. నేను అప్పుడే "టీ" కాచాను. అతనిప్రక్కనే బీరువాలో వున్న-కప్పులూ సాసర్లూ తీసుకువద్దామని అతనికుర్చీ వెనకనుంచి వెడుతున్నా నేనే పరధ్యానంగా వెళ్లానో అతనే పరధ్యానంగా చెయి వూగించాడో-కాని-అతని చెయ్యి నన్ను తాకింది. ఆ మధురమైన స్పర్శతో నా

శరీరం జలదరించింది. అంతవరకు-హృదయంలో అణిగి వున్న ప్రేమవాహిని వెల్లువలై పారింది. అప్పుడే గట్టిగా కావిలించుకుని తనివితీర ముద్దుపెట్టుకుందా మనుకున్నా కాని సాహసించలేకపోయాను...అతనిలో కూడా కొంచెం మార్పు కలిగింది కాని, చాలా గంభీరంగా- ఏమీ ఎరగనట్లు- బుద్ధదేవుడిలా అలాగే కూర్చుని; మళ్లీ సిగరెట్ ముట్టించి- నవలా నిమగ్న హృదయుడైనాడు. నిజంగా ఎవరన్నా సిగరెట్ కాలుస్తూంటే- అసహ్యం వెయ్యటమేకాకుండా వాంతి వెళ్ళేటంత పని జరిగేది. కాని అతను కాలుస్తూంటే- ఏ జవ్వాజి- అగరు వత్తులో వెలిగించినట్లు సువాసన వేసేది. ఆ మాహాత్మ్యం ఆ సిగరెట్‌లోనే వుందో- లేక అతనిలోనే వుందో కాని- నిజంగా నాకు కూడా కాలుద్దామా అనిపించేది...నేను కూడా చాలా హుందగా- బీరువా దగ్గరకు వెళ్లి కప్పులూ సాసర్లూ స్పూన్సూ తీసుకొచ్చా...అతను ఈ లోకంలోనే లేనట్లు నటించాడు. చాలా మందికి సందేహం. తాగుదామనిపించినప్పుడు తాగే వుంటానని. అబద్ధం ఎందుకూ నిజంగా తాగా...పాపం! నాకోసం- ఏన మాట ఎలా వున్నా— గోల్డ్ ఫ్లేక్ తెచ్చిపెడుతూ వుండేవాడు...ఈ కథ చదివిన ఆడవాళ్ళు- ఆడ జన్మ ఎత్తి- సిగరెట్ కాల్చిందే కాకుండా- చెప్పుకోటం కూడా ఎందుకు- సిగ్గులేక, అని తిడతారు నాకు తెలుసు...నిజమే. కాని- అతని సాంగత్యంలో వుండగా- నేనే కాదు- ఎంత ఛాందసం గల యువతి అయినా; సిగరెట్ కాదు- విస్కీ కూడా తాగుతుంది. బలవంతంగాదుస్మీ!...అలాంటి నేర్పరితనం- ఉపాయాలు- రసికత్వం- అతనిలో మూర్తీభవించాయి. ఏ ఆడదైనా-అతని చేతిలో కీలుబొమ్మ అవాల్సిందే...ఎంత ఇదైనా- ఇప్పుడు కొంతమంది ఆడవాళ్ళు పీలుస్తున్న సత్యం కంటె చెడిపోయిందా?...కమ్మటి సిగరెట్?...ప్రకృతం మరిచిపోలా.........నేను టీ



"చిత్రకళా పాండిత్యమంతా వొలికిపోయేట్లు అతని బొమ్మ గీస్తున్నా..." (౪౧-వ పేజీ)

కప్పులో పోసి కొంత-మిగతాది ఫ్లాస్కులో వుంచా...చూసి చూడనట్లు వూరుకున్నాడు...టి చల్లారి పోతుందేమో- తాగింతర్వాత చదువుకో కూడదూ? అన్నా...కొంచెం నవ్వుతూ...అది నా స్వాభావికం...కాని ఆ నవ్వులో ఏదో అర్థం స్ఫురించిందట అతనికి- ఈ తర్వాత ఎప్పుడో చెప్పాడు...వెంటనే అతను పుస్తకం డ్రాయర్ మీద పడేశి; 'అలాగా' అని చిరునవ్వు నవ్వుతూ; నాకో 'షాక్' ఇచ్చి కప్పు చేత్తో పుచ్చుకున్నాడు...నేను అక్కడే ఎదురుగా నుంచుని; ఆ పుస్తకం ఏమిటో అని చూస్తున్నా...అదివరకు దాకా ఇంగ్లీషు నావెలో- బెంగాలీ నావెలో అనుకున్నా...కాని అది శాస్త్రిగారు రాసిన కుంకమ భరణి. నేను పేజీలు తిరగవేస్తున్నా. అతను ఓరకంటితో... నా ఎడమ భుజం వైపు-...ఏమిటో వెతుకుతున్నట్లు చూస్తున్నాడు. చేతిలో టీసంగతే మరచిపోయినాడు...ఇదంతా నేను గమనిస్తూనే వున్నా... పది నిముషాలు గడిచింది. నేను ఏమీ మాట్లాడలా...అతనింకా అలాగే చూస్తున్నాడు. నేనే- టీ- వేడిగా వుందా?...చల్లారపోసి ఇవ్వనా?...అన్నా...అఖర్లా- అసలిది చల్లారి పోయింది...కాస్త నును వెచ్చటిదైతే బావుంటుంది...అన్నాడు నిగూఢంగా...మాటలతోనూ- చూపులతోనూ 'షాక్స్' ఇవ్వటంలో చాలా

ఘట్టివాడు...ప్వో కలకంఠ కూజితమనీ; సప్తమ స్వరమనీ - అంటారు సాధారణంగా- కవులు...ఇతని కంఠస్వరం విన్న తర్వాత-ఏకవీ ఆ ఉపమా నా లు తీసుకోడు...అథవా తీసుకున్నా-, కక్కుర్తి పడ్డాడు- ఆ కవి అనాల్సిందే...అసలు ఎంత సమస్ఫూర్తి ఆ వాక్యంలో...నేనన్నా...!అదిలా ఇవ్వండి ...ఈ ఫ్లాస్క్‌లో వున్న టీ పోస్తా'అని- కాని వొప్పుకోలా... ఉఁహుఁ. అందులో వున్న టీ నాకు చాలదు. మీరు తాగండి. పోనీ నేను హోటల్‌కి పోయి తాగి వొస్తా అన్నాడు...అలాంటి అవకాశంలో నేనే కాదు-ఏ ఆడదైనా పంపుతుందా?...అసలు అతను ఎదురుగా కూర్చుంటే నాకు అన్నం అఖర్లా...అతని సౌందర్య రసాన్ని గ్రోలుతూన్న నాకు ఇంకా ఆ టీ ఎందుకో?... అలా కాదు. మీరు ఇప్పుడు అంత దూరం హోటల్‌కు వెళ్లటం యెందుకు? అవసరమయితే మనిషిని పంపి నే తెప్పిస్తాటీ...పోనీ ఇవాళకు నేను మానేస్తా... అన్నా..."అమ్మమ్మ! ఎంత మాట!...మీరు నా మూలంగా అనవసరంగా టీ మానటం యెందుకు? అలా తాగటం మీకు అలవాటు అయింది. మానేస్తే తలనొప్పి వస్తుందేమో!...పోనీ యీ పూటకు అందులో వున్న టీ- ఇద్దరం చెరిసగం తాగేద్దాం. మీకేమన్నా అభ్యంతరమా?...అన్నాడు- అప్పుడే- తన హృదయంలో కూడా సగభాగం నాకు ఇచ్చేసి నట్లుగా. ఆ మాట వినేసరికి- నాకు చాలా సిగ్గువేసింది. అంత మాత్రం ఉదార స్వభావం- నాకు లేకపోయింది గదా అని...ఫ్లాస్క్ తీసుకుని రెండు కప్పుల్లోకి- రవ్వంత కూడా హెచ్చు తగ్గులు లేకుండా- సమానంగా పంచి- అలా కూర్చోండి తాగుదాం- అన్నాడు. అతని సరసనే కూర్చుని- టీ త్రాగే భాగ్యం కలిగినందుకు చాలా సంతోషించా- అప్పటి స్థితి ననుసరించి. ఈ తర్వాత చాలా సార్లు దగ్గరగా కూర్చోపెట్టుకుని; మీద చేయివేసి- పసిపిల్ల వాని చేత పాలు తాగించినట్లు తాగించేవాడు-మధ్యమధ్య తానుకూడా రుచిచూస్తూ...ఆనాడు అతని సరసనుకూర్చుని ఆ టీ తాగుతూంటే రోజూ తాగేటీఏనా?...అతని చేతి కివ్వగానే అమృతం ఏమైనా కలిపాడా? అనిపించింది...వెంటనే మళ్లీ సిగరెట్ ముట్టించాడు...ఇలా అస్తమానమూ సిగరెట్లు కాలుస్తూ కూచుంటే-పొగలో ఎదటనున్న వస్తువు కూడా కన్పించ దనుకుంటూ...మీకోసం ఎవరైనా వొచ్చినా; ఈ ధ్యాసలో మాట్లాడ రనుకుంటూ బహుశా...అన్నా నవ్వుతూ సరదాగా...కనపడక పోవట మేమిటి?...ఎంతమాట?...అసలు ఈ సిగరెట్ పొగలోంచి, ఆ ఎదటనున్న వస్తువు భాసాభాసంగా- అస్పష్టంగా-అతి మనోహరంగా-అదోహ రకంగా కనిపిస్తుంది...ఉన్న వస్తువుకు సరిగాచూస్తే-కొత్త సౌందర్యాన్ని-ఒక వింత సౌందర్యాన్ని-కల్పిస్తుంది సిగరెట్ పొగ. 'ఆర్టు' అంటే-అభిమాన మున్నవారంతా తప్పకుండా సిగరెట్ కాల్చవలసిందే...అందువల్ల నష్టమేముందీ?...అన్నాడు...అతని సమయస్ఫూర్తికి అతని మధుర సంభాషణకూ; అతని నవనీత హృదయానికీ- అతని ఉదారస్వభావానికీ-అతని ప్రేమపూరిత మనస్సుకూ-అర్పితమయింది నా హృదయం ...ప్రతి సూక్ష్మాంశంలో, కూడా సౌందర్యాన్ని-కళనూ అన్వేషించే-ఆ కళావేత్త సుకుమార హృదయం నా హృదయంలో హత్తుకు పోయింది.

★

మనస్సులో విపరీతంగా ఆందోళన ప్రారంభమయింది. అతను అలా చూడటంలో-నిజంగా ఏమయినా అర్థం వుందా?...సాధారణంగా మగవాళ్లు- రైలు స్టేషన్లలో; సినిమాహాలుల్లో ఆడది కనబడగానే చూపినట్లు చూడటమా?...అలా చూడటం వాళ్లకు అలవాటు. అందులో అసలు ఏమీ అర్థవుండదు. కొంతమంది చూపులతో రెచ్చకొడతారు-తమకు ఆభావం వున్నా లేకపోయినా...ఇతను ఏరకంలో వాడు?...

నిజంగా అతనికి మనస్సులో ఆ అభిప్రాయమే లేక పోతే-ఈజన్మ అంతా; అతన్ని మానసికంగా ప్రేమించి, పై జన్మలో అయినా-అతనిపొందు...లభించేట్లు ప్రేమ తపస్సు చేద్దా మనుకున్నా...అసలు జన్మలంటూ వున్న మాట వాస్తవమైతే-అన్నిజన్మలలోకూడా-అతనే నా హృదయేశ్వరుడు కావాలి!...

ఆనాడు అతను అర్జంటుగా పనివున్నదని వూరికి వెళ్ళిపోయాడు. ఆరాత్రి అంతా అసలు నాకు నిద్ర పట్టలా...ఆలోచనలకు వ్యవధిలేదు...ఉదయమే వెళ్ళి పోయే ముందు తలుపుచాటున చిలుకకొయ్యకు వున్న కోటు తీసుకుంటున్నాడు గుమ్మంలో నుంచుని. ముందు వసారాలో ఆయనగారు నుంచుని ఏదో మాట్లాడు తున్నారు...ఇతనంత అర్జంటుగా వెళ్ళిపోవటం నాకేమీ ఇష్టంలేదు...'వెళ్లవద్దు' అని చెప్పటానికి ధైర్యంలేదు. ఆయనవింటే ఏమనుకుంటారు?...అంతకు పూర్వం మనసులో వున్న అభిప్రాయాలేకాని, పైకి ఏమీ తేలలే దాయె...'అయ్యో! వెళ్లి పోతున్నాడే' అని హృదయంలో ఆదుర్దా జాస్తి అయింది. ఏమి చెయ్యటానికి పాలుపోటంలా... నా మనసులో అభిప్రాయం 'ప్లేన్'గా చెప్పేస్తేనయినా ప్రయాణం మానాడేమో అనిపించింది... కాని ఎలా చెప్పటం? తలుపుచాటునే నుంచుని వున్నా ఏదోపని వున్నట్లు...అతను కోటుతీసుకునే అవకాశంచూసి ఆచెయ్యి- ముంజెయ్యి ముద్దుపెట్టుకున్నా. ఏమిటో, ఎందుకలా ముద్దుపెట్టుకున్నానో నాకే తెలియదు...అంతలో అంత సాహసం ఎలా చేయగలిగానో నాకే ఆశ్చర్యంవేసింది...కాని అప్పటి నాస్థితి ననుసరించిచూస్తే నాకది పెద్దసాహసంలా కనిపించలా ...మళ్ళీ అంతలో అప్రయత్నంగా-విపరీతంగా-నేచేసిన పనికి నాకే సిగ్గేసింది...గభీమని లోపనికి వెళ్ళి పోయాను...నే ననుకున్న దానికంతా విపరీతంగా జరిగింది. అతనిలో ఆట్టేమార్పు కనిపించలా-నే చేసిన పనికి ఇంతకీ ప్రయాణం మానలా... వెళ్ళిపోయాడు. నాలుగయిదు రోజుల్లో వస్తానని మాత్రం చెప్పివెళ్లాడు ...ముద్దు పెట్టుకున్న తర్వాతకూడా ప్రయాణం మాననందుకు నాకు చాలాకష్టం తోచింది...

ఆయనగారు ఏడింటి కల్లా బజారుకెళ్లారు. అప్పుడు అతన్నిగురించి నే నెంత ఏడ్చానో; చెప్పలేను నిజంగా నామీద ప్రేమ లేనేలేదు అతనికని నిశ్చయించుకున్నా కాని అది అతనికి అత్యవసరమైన వ్యవహారపు పనేమో అని ఆలోచించలా...'ఛీ! ఈ మగవాళ్ళను నమ్మకూడదు' అనేమాట నిజమే ననుకున్నా ...అయ్యో! ఎందుకింత తొందరపడ్డానా? అని చాలా సీరియస్‌గా ఫీల్ అయాను...ఈప్రేమ నన్ను ఇంతగుడ్డి దానినిగా చేసిందేం?...అతనే నన్ను పూర్తిగా వశపర్చుకుని; నా మనస్సు నా దగ్గిర లేకుండా; తన వెంట తీసికెళ్ళి నన్ను ఉన్మత్తురాలినిగా చేశాడు...ఇలాంటి విషయాల్లో సాధారణంగా; ఆడవాళ్ళు చాలా గంభీరంగా ప్రవర్తిస్తారు...కాని నా మనస్సు- అతని ముందర అంత తేలిక అయిపోయిందే?...మించినదాన్ని గురించి ఆలోచించి ప్రయోజనం ఏముంది?...లోకులకు ఈ విషయం తెలిస్తే నన్నెంత హీనంగా చూస్తారూ? సృష్టి అసలు అందుకోసం కదూ?... అలాంటప్పుడు అలా జరిగింది అనగానే- ఎందుకో అంత హీనంగా చూస్తారు?...వ్రతం చెడ్డా సుఖం దక్క-లేదన్నట్లు అయింది. హీనంగా చూసినా నాకేం చింత లేదు...అతనే నన్ను ప్రేమిస్తే- నే వాళ్లని కక్కేసినట్లు చూడగలను...అతను మళ్లీ వొచ్చింతర్వాత- నాయందతనికి ప్రేమ లేకపోతే- నాకోసం నేను ప్రేమించుకుంటానని చెబుతా...నా మనస్సు నా స్వాధీనంలో లేదు. అతని మనస్సు కనిపెట్టకుండా, మళ్ళీ రాగానే కౌగలించుకుంటానేమో?... అసలు మళ్లీ వొస్తాడా? నా హృదయపూర్వకంగా ప్రేమించిన వ్యక్తినాకు లభించక పోయింతర్వాత...నా జీవితానికి ఇంక సుఖం ఏముంది? శాంతి ఏముంది? పోనీ

త్వరలో దేహయాత్ర ముగిస్తే మళ్లీ ఇంకో జన్మలో అయినా... అతన్ని కలుసుకోగలనేమో!- నేనింతలా ప్రేమిస్తే- ప్రవరుడిలాగా సంచరిస్తాడా?...అంతఛాందసుడా?...ఎవరో 'కాదు- అన్నట్లు వినబడింది... ఇలాంటి వాటికే పూర్వం ఆకాశవాణి పలికినట్లయింది...ఇలా మనస్సులో చీకాకు అశాంతి ఏర్పడింది. ఇంత ఆందోళనా అతనూ పడ్డాట్ట ఈ తర్వాత చెప్పాడు ఒకసారి...

స్టేషన్‌దాకా- వెళ్లటమా?- మానటమా? అని మీమాంస పడుతూనే వెళ్లాట్ట టిక్కెట్ కొన్నాట్ట తర్వాత వెళ్లే బుద్ధిపుట్టలేదట. ఆ రైలు-మమ్మల్నిద్దరినీ వేరుచేసి-తనను ఎక్కడికో తీసికెళ్లదామని వొచ్చిన పెనుభూతంలా కనిపించిందట. చివరకు రైల్లో ఎక్కిం తర్వాత-మానివేద్దామని రెండు మూడుసార్లు దిగాట్ట కాని చాలా అత్యవసరమయిన పని అవటంవల్ల మధ్యాహ్నమయినా వెళ్లక తప్పదు కనుక—తీరాయింటికి వొచ్చినా ఆయనకు ఆదివారం అవటంవల్ల ఆఫీసు కెళ్లక ఇంటిదగ్గరే వుంటాడు కనుక; తాను వొచ్చిన ఉద్దేశ్యం నెరవేరదని మానేశాట్ట... "ఆమెకు ప్రేమ వున్నట్లు తెలియపరచింది నాకు కాని నాకుకూడా ఆమె మీదప్రేమ వుందని చెప్పటానికి అవకాశం లేక పోయిందే నామనస్సు తెలియక ఎంత వేదన పడుతోందో?...నా మనస్సు ఆమెకు వ్యక్తపరచి-త్వరలో వొస్తాను అనుజ్ఞ ఇవ్వవలసినదని చెపుదామనిట" వుద్దేశ్యం.

* * *

అతను వొచ్చేవరకు-ఆ మూడురోజులు మూడు యుగాల్లాగా గడిచాయి. అనుకున్న ప్రకారంవొచ్చాడు పాపం!...ఆరోజున-రాకపోతే హారోం-అవేదేప్రాణం ...కళ్లలో వున్నాయి అప్పటికి ప్రాణాలు...ఏమీ తోచేదికాదు. రాత్రిపూట మరీని...సృష్టిలో వున్న రాత్రులన్నీ కలిసి-ఆ మూడురాత్రులు అయాయేమో అనిపించేది. ఆ మూడురోజులు నే చేసింది కేవలం ప్రేమ తపస్సే...అతను కనపడేసరికి—నేను ఆ మూడు రోజులు చేసిన తపస్సు ఫలితం అప్పుడే ఫలించింది కామోసు అనుకున్నా. రోజూ- రాత్రిళ్లు అప్రయత్నంగా ఏమిటో దుఃఖం విపరీతంగా వొచ్చేది. కాని ఎవరికి తెలుసూ?...ఆయన గారికా?...వారికేంపసీ?... ఆ అయిదు నిమిషాలు- మినహాస్తే- ఈ వ్యక్తి ఏమయితే ఆయనకేం?...కాని మంచం పట్టటమాత్రం తెలుసు...పగలస్తమానమూ ఒక్క పనిచేత పట్టేది కాదు. ఏ వస్తువును చూసినా, అసహ్యం—అసంతృప్తి. అతనిగోసమే వెతుకుతూ వుండేవి కళ్లు ఎప్పుడూ...అంత అపూర్వమయిన అనుభవంలా వుండేది...ఎలా వున్నానో- వుండగలిగానో నిజంగా నాకే తెలియదు. అతను వొచ్చేవరకు అన్నం సయించితే వొట్టు. నిద్ర అసలు సున్న...కళ్లు గుంటలడ్డాయి అద్దంలో చూసుకుంటే- నన్ను నేను గుర్తుపట్టలేనంతయిపోయాను. ఆయనగారు అలా వున్నావేం?...కారణమేమిటి? అని అడగలా...అసలు ఈ కొంతమంది మగవాళ్ల ఉద్దేశ్యాలు.- ఇంట్లో అన్నీ వొస్తువుల్లాగానే- పెళ్లాం కూడా ఒక వొస్తువు...పనికి వొచ్చినంతకాలం వుపయోగించుకుని పనికి రాకపోతే- ఆ వస్తువులను వొదిలెయ్యటంలా...అంతే పెళ్లామైనా...ఇంట్లో వొస్తువు- అరిగిపోతే- ఎందుకు అరిగి పోతోంది అని అనుకుంటామా?...పెళ్లాం చిక్కిపోతే అడగటానికి... పెళ్లాం అంటే ఏమిటో తెలియని ఇలాంటి మగవాళ్లకు పెళ్లాలు ఎందుకో—విలువ తెలియని వాళ్లకు విలువగల వస్తువిస్తే- ఎలా ఉపయోగించుకుంటారో, ఇలాంటివాళ్ళు పెళ్ళాన్ని అలాగే ఉపయోగించుకుంటారు.

3

అతను ఊరునుంచి వచ్చేసరికి పదకొండు గంటలైంది. ఆయనగారు మామూలుగా ఆఫీసు కెళ్ళారు. నేను ఏమీతోచక శారదానికేతనంలో చిన్నతనంలో నేర్చుకున్న చిత్రకళాపాండిత్యమంతా వొలికిపోయేట్లు

అతనిబొమ్మ గీస్తున్నా కాని నాకే నచ్చటంలా-ఎన్నిసార్లు ప్రయత్న పూర్వకంగా గీసినా...ఇంతలో వొచ్చి, భోజనమయిందా?.. ఏమిటి డ్రాయింగ్ వేస్తున్నావులా వుందే.. ఏదీ-నాదే ఫొటో?...చాలా బావుంది... ఇంత పాండిత్యం ఎక్కడ నేర్చుకున్నావు?...ఎంత అదృష్టవంతుణ్ణి నేను...అని నాసమాధానం ఇంకారాక ముందే-పక్కనేవున్న కుర్చీ ఇంకాదగ్గరసా-నాకుర్చీ సామీప్యానికి లాక్కుని-ఈ నాలుగురోజుల్లో ఇంతిలా చిక్కిపోయావేం? ఏమైనా సుస్తీచేసిందా?...అన్నాడు చిరునవ్వు నవ్వుతూ...అసలు నన్నుచూడగానే కనుక్కున్నాట్ట చిక్కిపోవటానికి కారణం...అయినా నా చేత చెప్పించాలని......ఏం చిక్కిపోలేదే...మామూలుగానే వున్నా...అన్నా ముభావంగా...మనస్సులో వున్న సంతోషం పైకిపొంగి అతన్ని చూడగానే ముఖం కొంచెం ఉబికింది. అలాగా!...నిజంగా పాపం! నా మనస్సు గుర్తెరుగక చాలాబాధ పడ్డావనుకుంటా... నువ్వు ఎంతదాచినా నీకళ్ళు చెప్పటంలా...ఇంకా ఇప్పటికీ నామనస్సు తెలియక నువ్వు ఎంత పరితపిస్తున్నదీ-నువ్వు చెప్పకపోయినా నీ కళ్ళు చెబుతూనే వున్నాయి...కాని ఆనాడు ప్రయాణం మానటానికి వీల్లేక పోయిందాన్ని!...నీకు వున్న బాకీ వడ్డీతో కూడా తీర్చుకో!...ఫొటోకు ప్రెజంట్ కూడా వేరే ఏమీ చెయ్యలేను...అని- కళ్లమీదా...చెంపలమీదా...ఎన్ని ప్రదేశాలల్లో...ఎన్నివేలు ముద్దులు పెట్టుకున్నాడో అబ్బ!...చెప్పలేను. ఊపిరి సలపలా... నాకు చాలా సిగ్గువేసింది. నేను తప్పించుకుందామని- అతని బాహుపంజరంలో నించి- కొంచెం ప్రయత్నం చేశా...అది ఎవరికైనా సహజమేగా!...ఆ వ్యక్తికోసం ఎంత పరితపిస్తున్నా ఎదట పడేసరిగి ఎంతో నిబ్బరం!... కాని అతను విడిచి పెట్టందే...అంతకంటె నేను యీ సృష్టిలో కోరేది మాత్రం ఏముందీ?-... అలాంటి అవకాశాన్ని నే కాదు, మరొకరైతేమాత్రం చెడగొట్టుకుంటారా?......సంతోషాతిరేకంవల్ల శరీరంలో రక్తం ఉప్పొంగిపోతోంది. నోట్లోంచి మాట రావటంలా...సుఖపారవశ్యంలో...కొంచెం మూతలు పడ్డాయి కళ్ళు...అబ్బ ఆ సుఖం నే చెప్పలేను...అతని చేతుల్లో అలా ఎంతసేపున్నానో!...స్వర్గం స్వర్గం అంటారు...అక్కడ యింతకంటె సౌఖ్యం ఏముందీ?... 'దూరపు కొండలు నునుపు' అన్నట్లు- ఏమిటో వుందని అనుకుంటాం కాని- ఇంతకంటె- విశేషం అక్కడా ఏమీ లేదు...వున్నదని ఇక్కడ సుఖాలన్నీ చెడగొట్టుకుని- అక్కడ ఏమీ లేకపోయేసరికి ఉభయ భ్రష్టత్వం-అవుతూ వుంటారు, ఎదట ప్రత్యక్షంగా కన్పించే సుఖాలన్నీ మిథ్య అనుకుని; అప్రత్యక్షమైన వాటిని నిజమని నమ్మటమంత అవివేకం మరోటి వుందా?...

సుఖదినాలు చాలా త్వరగా గడిచిపోతాయి అంటారు. కాని అంత త్వరగా గడిచిపోతాయి అని అనుకోలా నేను ..రోజుకు ఇరవైనాలుగు గంటలా ఇరవైనాలుగు నిమిషాలా అని సందేహం కలిగింది నాకు. అయితే అలా యెన్నాళ్లు గడిచాయో నేను చెప్పలేను. క్రొత్తక్రొత్త సుఖాలు నూతన అనుభవాలు-ఎన్నడూ కనివినికూడా ఎరుగనివి అనేకం అనుభవింప చేశాడు...నాకు చాలా ఆశ్చర్యంవేసింది...ఇతనింత అనుభవశాలియా? అని కాని అతనికికూడా నూతనానుభవమేనట...

రోజూ రీడింగురూములో కూర్చుని ఏదో పుస్తకం చదువుతూ వుండేవాడు. అవి శృంగార సంబంధమో మరి ఇంకేమన్నానో నాకు తెలియదు. ఆయన గారున్నంతవరకు ఏంచదివేవాడో నాకు తెలియదు. ఒకరోజున ఆగది గుమ్మందగ్గరకు వెళ్లేసరికి ఏదో క్రొత్త పుస్తకం తీశాడు...సాయంకాలానికి అందులో అయిదు అక్షరాలు కామోసు చదివాడు...అయితే ఈలోగా ఏంచేసేవాడో నే చెప్పలేను...అవి హాస్యాలుకావు- అవి నర్మసంల్లాపాలుకావు-ప్రేమ దృక్కులు కావు;

ఇంత ఎందుకు? అలాంటి విషయాల్లో ఒట్టి అల్లరి పిల్లాడు...ఒకరిని ఒకరం చూసుకుంటూ కూర్చుంటే చాలు మాకు-ఈ ప్రపంచం తుపానువొచ్చి కొట్టుకు పోయినా మాకు తెలియదు. పవిత్రమైన ప్రేమవుండాలి కాని...దృష్టులు చాలవూ? కావలసినది పరస్పరా కర్షణ...ఎప్పుడూ దగ్గరవుంటే పరస్పరం—ఆ కర్ష ణత్వం తగ్గుతుంది అంటారుకొంతమంది...ఏమో ఆ మాటయందు నాకు విశ్వాసంలేదు...

ఇన్నాళ్లూకూడా-రహస్యంగా వుంచాలి—మా ప్రేమసంగతి-అని మే మెప్పుడూ ప్రయత్నించలా... ఆలా అని మేము ప్రేమించుకున్నాం-అని ఒకరితో- కాని ఆయనగారితో కాని చెప్పలా...అవసరం లేక పోయింది...అంతే...

కాని ఆయన ఈ స్థితి గమనించారు. కాని ప్రత్యక్షంగా చూడగా మొదటలో......అనుమానం వుంటే చాలామంది అంతే...వెంటనే నన్నడిగినా నేచెప్పేదాన్ని. ఇన్నాళ్ళనుంచీ-ఆయన, నేను ఒక ఇంట్లో వుంటున్నామా? నా మనస్సును గ్రహించలేక పోయాడు...నిజంగా ఆలోచిస్తే మనలో మాట- ఎందుకూ బాధపడటం? ... ఆయన గారు అయిదారేళ్ళనుంచీ తన స్వేచ్ఛను సారంగా- ఇష్టమొచ్చిన స్త్రీతో సుఖాలు అనుభవిస్తూ వుండే వారు. నాతో అది ఒక గొప్ప తనంగా పరిగణించి చెబుతూ వుండేవారు. నేను ఆయనగారిని కాని- ఆ యువతులను కాని పల్లెత్తుమాట అనలా...ఎందుకు అనాలి?...ఆయన సౌఖ్యానికి నేనెందుకు విఘ్నం కలి గించాలి...? ఆయనగారి మీద ఎంతో ప్రేమవుంటే తనను సరీగ్గా ప్రేమించకపోతే- తాను ఆయనగారి ప్రేమకు అర్హురాలను కాకపోయితినే అని విచారించాలి...

అప్పుడప్పుడూ నన్ను...కోరుతూ వుండేవారు. నేను- అందుకు ఎప్పుడూ అంగీకరించలా. దౌర్జన్యం చూపించేవారు...నా భార్య వైనందుకు తప్పదనే వారు...ఏం చెయ్యాలో తోచేది కాదు...

నాకు మొదటినుంచీ ఏదో ఒక కల్లోలం మాత్రం మనసులో వుండేది. నా ముఖంలో ఒక ఆశ తాండవిస్తూ వుండేది, నా మనస్సు- నాకు తెలియకుండానే- దైవం- తనకు ఏర్పాటు చేసిన పురుషుణ్ణి వేడుతూ వుండేది...ఇప్పటి కితని మూలంగా నా మనసులో కల్లోలం తగ్గిపోయింది. హృదయం ప్రశాంతంగా వుంది...

ఒక నాడితను ఏదో అత్యవసరమైన పనులుండటం వల్ల వూరికి వెళ్ళిపోయాడు. నాకు ఏ మాత్రం ఇష్టం లేదు వెళ్ళటం. వద్దంటే ఆగిపోయాడు. మనస్సు మాత్రం విపరీతంగా బాధపడ జొచ్చింది అతనికోసం! అంత బాధ నే ఎప్పుడూ పడలా. ఒకటే ఆందోళన... కారణ మేమిటో!...నా మనస్సులో దుఃఖము పొంగి పోతోంది...ఇలాంటి స్థితిలో వుండగా...ఆయనగారు కాంక్షించారు నా శరీరాన్ని...నేను సుతరామూ అంగీ కరించలా... అతనిమీద అంత ఆశతో వున్నా నా ఆత్మను...ఇలా బాధపెట్టడం నాకు ఇష్టం లేక పోయింది. అయినా తప్పలా...మగ వీరులు కదూ? .. దౌర్జన్యం...

ఆనాటి స్థితి "గోరుచుట్టుమీద రోకలి పోటు"లా గయింది. దుఃఖముగాలా. ఏడుస్తూ పడుకున్నా... ఎప్పుడో ఒక నిద్ర పట్టింది...నా ప్రేమమూర్తి కలలో ప్రత్యక్షమయినాడు. 'భానూ'- ఏదీ! ఒక్క ముద్దు!' అని కలవరించా...ఆయన మేలుకుని వున్నాడు. ఆయన అనుమానం ప్రత్యక్షమయింది...ఆమాట వినే సరికి ఆయన హృదయం కలక్కుమంది. ఈ మాత్రా నికే హృదయం అంత బాధపడితే-అదిపరకు మాట ఎలావున్నా-నే కాపరానికి వొచ్చిన రెండేళ్లనుంచీ- ఈయనచేసే పనులకు నేనెంత బాధపడాలి?...నా హృదయం ఎంత కుళ్లిపోవాలి!......ఒకనాడు ఎవతెనో ఒక యువతిని ఇంటికి తీసుకుని వొచ్చి-నా కళ్ళముందర పడుకోటమే కాకుండా-నన్నుకూడా సరా సరి రమ్మని-ఒప్పుకోకపోతే- బలవంతాన మంచానికి కట్టేసి-మా యిద్దరిమధ్య పడుకున్నాడు. మరి ఆనాడు నా మనస్సు ఎంత బాధపడిందో-ఆలోచించాడూ?- సామాన్య స్త్రీ-లోకానుభవం లేని స్త్రీ నిజంగా ఆత్మ హత్య చేసుకొనేదేగా!...ఇలాంటి మాటలన్నీ బయట పెడితే-మగవాడు ఎలా ప్రవర్తించినా తప్పులేదంటారు అంతా... చేయకూడని పని అయినప్పుడు-ఒకరుచేస్తే తప్పు- మరొకరు చేస్తే-ఒప్పు...అవుతుందా?...

వెంటనే నన్ను నిద్రలేపారు. భానుకీ నీకూ ఈ సంబంధం ఎన్నాళ్లనుంచి?...అని అడిగారు .. ఇంత ఖంగారుగా అడుగుతారెందుకూ?...షుమారు సంవత్సరం నుంచీవుంది. అన్నా...అబద్ధమెందుకు చెప్పాలి? ...రహస్యంగా కన్నుగప్పి సంచరించాలని-నే నెప్పుడూ ప్రయత్నం చెయ్యాలా...రహస్యంగా కూడా అతన్ని కలుసు కోవటానికి- ప్రయత్నించలా...పబ్లిక్ గానే— కలుసుకోవాలనుకున్నప్పుడు కలుసుకునేవాళ్లం...కాని అలాంటి సమయంలో ఆయన వుండటంగాని రావటం కాని తటస్థించలా...



"భానుతో సంబంధం వదులుకో"

"జరిగి పోయిందేమో జరిగిపోయింది. ఇహ భానుతో సంబంధం వొదులుకో...ఇహ నతను గుమ్మంలో అడుగు పెట్టాడంటే నే సహించను తగిన ప్రాయశ్చిత్తం చేస్తా" అన్నాడు...ఈమాట అన్నందుకు నాకు కోపమూ వొచ్చింది. ఒకవేళ అతన్ని రాగానే కొడతాడేమో అని భయమూ వేసింది...

నే చెప్పా...

ఎందుకు అనవసరంగా అతన్ని కొట్టడం!...అతని తప్పు ఏముందీ?...పురుషుడు స్త్రీని ప్రేమించటం- అసలు సృష్టి సహజం. అతన్ని కొట్టడం వల్ల మీకు కలిగిన ప్రయోజనం?...నేను పతివ్రతను అవుతానా- ధర్మశాస్త్రాల ప్రకారం?...అతను నన్ను ప్రేమించాడని మీకెందుకూ ఉక్రోషం?...నాకు నిజంగా నవ్వు వొస్తుంది. మీలాంటి వాళ్లంతా- ఇలా...జరిగితే- పెళ్ళాల్ని ఏమీ అనరు. ప్రేమించిన యువకుల మీదకు బయల్దేరతారు కొడతామంటూ. పెళ్ళాల మీద తీపిచేత కొట్టకపోవడం కాదు. ఇంట్లో వుంటూ వుండటం వల్ల ఏర్పడే- స్నేహం లాంటిది. అంటే- పెంచుకున్న ఆవులమీద కుక్కలమీదా వుండదూ?...అలా అన్నమాట. మీ రా అభిప్రాయం మార్చుకోండి. మీ రింతవరకు ఎన్ని దెబ్బలు తిన్నారూ? చాలామందితో సంబంధం వుందిగా...ఒక్క దెబ్బ తిన్నట్లైతే మీ మనస్సు ఎలా వుండేదో ఆలోచించుకోండి"

సంబంధం వొదులుకో మన్నారు. అది నా జీవితంలో సాధ్యం కానిమాట. ఈ జీవితంలోనే కాదు- ఎన్ని జీవితాలనైనా ఈజీవి-ఆభానునే ఆ నిష్కల్మష హృదయుణ్ణే-ఆ పవిత్ర ప్రేమమూర్తినే కోరుతూ వుంటుంది. ఇన్నాళ్లనుంచి-భానుకోసం ఎంత తపించి పోయిందో నాహృదయం మీకేం తెలుసు?...ఇలా చేజిక్కిన నా ప్రియుణ్ణి వదులుకోనా?...అది ఎలా?... సంవత్సరం అనుభవ మయిందిగా అంటారేమో!... అయితే ఏం?...ప్రేమకు ఇన్ని సంవత్సరాలవరకు అని లిమిట్ వుందా?...ఎన్నివేల సంవత్సరాలు అయితే మాత్రం ఏం? ..సంవత్సరానికి-నెలకూ-రోజు రోజుకూ క్రొత్త యువకుని కోరే-మోహమూ కామమూకాదు. నిష్కల్మషమైన ప్రేమ నాది. నా మనోస్థైర్యం మీకు తెలియదు కాబోలు! అతన్ని వొదిలివెయ్యమని మీ రెందుకు చెబుతారు?...నే నా పని చెయ్యలేను... మీరాప్రసంగం ఇహాయెత్తవద్దు.'అనిచెప్పా ఖచ్చితంగా. ఇలా మాట్లాడుతుంటే- ఆయన మొహంలో కాంతి లేదు...తెల్లబోయినాడు. మళ్ళీ మాట్లాడలా...

... ... ...

నాలుగు రోజులు గడిచాయి. ఈ నాలుగు రోజుల్లో- ఒక్కసారి అయినా నాతో మాట్లాడలా... అతను వూరినుంచి వచ్చేశాడు. అతనికేమయినా అపకారం చేస్తాడేమోనని నాగుండె దడదడ లాడటం

ప్రారంభించింది. కాని అతనిజోలికి పోలా... మనసులో మాత్రం ఎందుకో విపరీతంగా బాధపడేవాడు. భానుతో మాట్లాడేవాడు కాదు అసలు. అతన్ని చూడగానే- తుమ్మల్లో(పొద్దుకూకినట్లు మాడ్చుకునే వాడు. ఎవరికేం?...

ఆయనగారికి ఎవరైనా ఉద్బోధన చేశారో ఈ సంగతి తెలిసి- ఆయనకే తోచిందో ఈ బుద్ధి- మనస్సులో- ఆ బాధ పడలేక- ఒకరోజున- నేను భోజనం చేస్తూండగా- వొచ్చి- "అతనితో సంబంధం వొదులుకున్నా సరే- నా యింట్లోంచి వెళ్ళిపోయినా సరే-" అన్నారు.

అప్రయత్నంగా- మంచిది శెలవ్!... వెళ్లిపోతానన్నా..."తెల్లవారితే ఇహ నీముఖం నాకు చూపించవద్దు" అన్నారు. "అబ్బా" అన్నా.- నాలుగు గంటలకు అతను వొచ్చాడు. జరిగిన పరిస్థితి అంతా చెప్పా. ఇహముందు కర్తవ్యమేమిటి చెప్పమన్నా...

"పిచ్చిపిల్లా! అతను వొదిలేస్తానంటే ఎందుకంత భయపడతావు. ఇంకా నే జీవించేవున్నాగా!...నేను ఏమైనా అంటానేమో అని సందేహిస్తున్నావా? నిన్ను అటూకాకుండా ఇటుకాకుండా-చేసే-కేవలం కాముకుణ్ణి అనుకున్నావా?...ఇంకా నీ తల్లితండ్రిలు నీ(కు) వుద్యోగం చెయ్యటానికి తగినచదువు చెప్పించలేదు కనుక ఈ ప్రశ్న వేశావు నన్ను...లేకపోతే...హాయిగా ఎక్కడో వుండే నాకు కబురంపేదానవు...సంకోచం పెట్టుకోకుండా ఈ రాత్రి వొచ్చేశెయ్యి...హాయిగా సుఖంగా...కాలక్షేపం చేద్దాం"అని అభయ హస్తమిచ్చాడు.

ఆయనగారు ఇంటికిరాగానే-నేను వెళ్లిపోతున్నా గుడ్‌బై అన్నా...ఏమీ మాట్లాడలా...నీ తాలూకు సామాన్లు అవీ తీసుకుని వొచ్చేశా...కాని ఇలా వొస్తానని అనుకోలా...వెళ్లిపొమ్మని బెదిరిస్తే-తనతో వుంటా ననుకున్నాడు ఆయనకీ దిగులే మనస్సులో వొచ్చేశానని. ప్రస్తుతం ఇంట్లో రెండోసహాయం లేదు. వంటచేసేందుకు చాలా అవసరం...

అతని ప్రోత్సాహంమూలంగానే వొచ్చేశాననీ; అతన్ని ఇంకా ఏదో సాధిద్దామనీ, వుద్దేశంతో..."అక్రమంగా నా భార్యను తీసుకువెళ్ళాడని కేసు చేశాడు... ఇదీ అసలు తత్వ కథ...


నా అవసరం లేదన్నప్పుడు ఆయనకు కేసు యెందుకు?...తనకు వొచ్చి ప్రయోజనం ఏమిటీ?... తన తెలివి తక్కువ తనం- అమాయకత్వం బయట వేసుకోవటమేనా?... మరి ఇంకేమన్నానా?...మేమిద్దరం ఒకచోట ఉండిపోయామని-మనసులో అసూయ ఓర్వలేని తనమూను! తనకూ నాకూ సంబధం లేదనుకున్నప్పుడు- తన ఇంట్లో తన వస్తువు పూచీ పుల్లనే తీసురానప్పుడు- యేమిటీ కేసు?... ఈ అసహ్యమూను...

నేను వున్నదున్నట్లు చెప్పా...నమ్మినా సరే- నమ్మకపోయినా సరే...అంతా అనుభవజ్ఞులే- సృష్టి రహస్యం తెలిసిన వారే- మగవాళ్లమనే అభిమానం తీసేసుకుని- పబ్లిక్‌గా మనస్సులో దాపరికం లేకుండా ఆలోచించుకుంటే—పైకి చెప్పకపోయినా—యదార్థ స్వరూపం మీ మనసుకుమాత్రం తెలియదూ?— ఇందులో-ఎవరిదెంత న్యాయమో, ఎవరిదెంత అన్యాయమో విచారించండి-

ఇహనే చెప్పవలసిందేమీలేదు. అతన్ని నా జీవితంలో మనోవర్తి అడగవలసిన అవసరం లేదు నాకు అంత అసహ్యమైనపని ఎన్నడూ చెయ్యను... సంబంధం-ఇక్కడే రద్దుచేసుకోమన్నా చేస్తా...ఇదవరలో నామీద చూపించిన దౌర్జన్యంచాలక-ఇంకా మమ్మల్నిద్దరినీ కూడా 'ఇన్‌సల్ట్' చెయ్యాలనిచూస్తున్నాడు. ఆయన దౌర్జన్యం సాగినన్నాళ్ళు సాగింది. ఇహ సాగదు. అభిమానమున్న వ్యక్తులమేకాని మేము తనలాగా మానవత్వం నశించిన వాళ్లం గాదు. పైగా

సిగ్గులేక- కేసు చేసినందుకు నాకు నవ్వు వొస్తోంది. లంచం కోసం- మీ శక్తినీ- మీ ఆలోచనా పటిమనూ మీరు అమ్ముకోవద్దు. మీ స్వశక్తిని- మీలో వున్న ప్రతిభను- లంచం కోసం విసర్జించితే- తరువాత చిల్లి గవ్వకు మారరు. బాగా ఆలోచించుకోండి బారా!...ఎంతకైనా- వెనుదీయని మగవాళ్ళు ఎంతమంది వున్నారు!...ఇలా ఎంతెమంది ఆడవాళ్ళని హింసిస్తున్నారో ఇలాంటి మగవాళ్ళు- తాము వదలేసి-ఎదటివాడిమీద తీసుకొచ్చినందుకు కేసుచేస్తే-ఈ అమాయకపు స్త్రీలంతా ఏమవాలి?... ఏం? ఆడదనగానే అంతలోకువ? సాటి మానవజాతి కాదూ స్త్రీలదిమాత్రం?...మమ్మల్ని శిక్షించటం విధాయకమని తోస్తే-న్యాయమని తోస్తే-ఇద్దరినీ ఒకజైల్లోనే వేయండి...లేదా- వొదిలెయ్యండి...లేక- మమ్మల్నిద్దరినీ విడదీసి-జైళ్ళలో-వేరుచోట పారేశారా—మీరు కూడా మామీద దౌర్జన్యం చూపినవారవుతారు. మిమ్మల్నికూడా ఆ లిస్టులోనే జమకట్టుకుంటాం మీరు దౌర్జన్యం చూపిస్తారా?...లేక న్యాయం చూపిస్తారా మాయందు.


# అయఃకాంత ద్రావకం



ధాతువృద్ధికి సేవింపదగినది ద్రావకము ఇనుము. ఇనుము తిన్నవారికి నీరసము, ముసలితనము లేదని అగస్త్యాదులు వచించియున్నారు. కావున దీనిని సేవించుటచే భీమబలము సిద్ధించును.

ద్రావక సేవనమువలన గలుగు గుణములు.

ఉష్ణముచే వెంట్రుకలు రాలుకుండ ఆగును, కాలుచేతులు, కండ్లమంటలు పోవును, ముఖమునకు తేజస్సు నిచ్చును, వాతమును, ఉష్టమును పోగొట్టును, కాళ్ళు చేతుల దుర్బలము నణచి నొప్పును పోగొట్టును ఆకలిని జీర్ణశక్తిని కలిగించును. సడలిన నరములకు సత్తువ జేయును. గుల్మము, గుండెనొప్పి కలవారు ఈ అయఃకాంత ద్రావకమును 8 రోజులు సేవించినచో జాలును. ధాతుపుష్టి లేని వారు 40 రోజులు సేవించిన జాలును.

(అర్ధ మండలం) 20 రోజులకు మందు 1-0-0.

(1 మండలం) 40 రోజులకు వచ్చుమందు 1-12-0.

ఆర్య బుక్ డిపో,

తిరువళ్ళిక్కేణి, :: :: మదరాసు.